క్లుప్తంగా

సన్మానం



నర్సంపేట : రైస్ మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన నర్సంపేటకు చెందిన గోనెల రవీందర్ సోమవారం ప్రమాణస్వీకారం చేసిన సందర్భంగా ముదిరాజ్ అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (మెపా) వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు పులి దేవేందర్ ఆధ్వర్యంలో గజమాలతో ఘనంగా సన్మానించారు. పెద్దమ్మతల్లి చిత్రపటాన్ని బహూకరించారు. అనంతరం మెపా వ్యవస్థాపక అధ్యక్షుడు దేవేందర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పొన్నం రాజు, డివిజన్ అధ్యక్షుడు పెండ్యాల యాదగిరి మాట్లాడారు. ముదిరాజ్ కులస్తులు అన్ని రంగాల్లో ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి నీరటి రాజు, అధ్యక్షుడు తాళ్ల రవీందర్, జిల్లా ప్రధాన కార్యదర్శి పెండ్యాల కృష్ణ, నాయకులు పిట్టల కుమార్, కూతురు రాజు, బరిగెల భాస్కర్, దండు చిరంజీవి, మారపాక రమేశ్, సింగారపు రామకృష్ణ, బోనాల రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

స్టడీ టూర్‌కు వెళ్లిన మార్కెట్ పాలకవర్గం



నర్సంపేట : నర్సంపేట వ్యవసాయ మార్కెట్ యార్డు పాలక వర్గం సోమవారం ప్రత్యేక బస్సులో స్టడీ టూర్‌కు బయలుదేరి వెళ్లారు. మార్కెటింగ్ విధివిధానాలు తెలుసుకునేందుకు, నర్సంపేట మార్కెట్ అభివృద్ధికి చేపట్టాల్సిన కార్యక్రమాలపై స్టడీ టూర్ కొనసాగనుంది. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ పాలాయి శ్రీనివాస్, వైస్ చైర్మన్ శాఖమూరి హరిబాబు, డైరెక్టర్లు, మార్కెట్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మేళాకు హాజరు కావాలి

వర్ధన్నపేట : వరంగల్ నగర పరిధిలోని రంగశాయిపేటలోని జీఎం కన్వెన్షన్ హాలులో ఈనెల 27 వరకు నిర్వహించనున్న రాష్ట్రస్థాయి రైతు ఉత్పత్తిదారుల సంఘాల మేళ–2025 కార్యక్రమానికి మండల రైతులు హాజరు కావాలని మండల వ్యవసాయ అధికారి విజయ్‌కుమార్ సోమవారం ఓ ప్రకటనలో కోరారు. మేళాలో రైతు ఉత్పత్తిదారుల సంఘాల ఏర్పాటు, అభివృద్ధిపై అవగాహన కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. వసతితోపాటు అల్పాహార, ఇతర సదుపాయాలుంటాయని వివరించారు.

ఆర్థికసాయం



నర్సంపేట : చెన్నారావుపేటలోని సిద్దార్థ స్కూల్ ఉపాధ్యాయుడు కొండపర్తి కృష్ణమోహన్ రోడ్డు ప్రమాదంలో గాయపడి కాలు విరగడంతో చికిత్స చేయించుకుని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటుండగా ఆయనకు ఆ స్కూల్ ఉపాధ్యాయులు, మిత్రులు, పాఠశాల పూర్వవిద్యార్థులు కలిసి సమకూర్చిన రూ.90 వేలను సోమవారం అందజేశారు. తొలుత కృష్ణమోహన్‌ను పరామర్శించారు. కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ అండెం కరుణాకర్‌రెడ్డి, ఉపాధ్యాయులు, మిత్రులు మెట్టు రమేశ్, సాంబయ్య, తోట పవన్, నరిగె శివరాజు, ముంజ జగదీశ్వర్, ప్రదీప్ చౌదరి, బొనగాల రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారి వైద్యానికి..

గీసుకొండ : మండల కేంద్రానికి చెందిన తాళ్లపెల్లి నాగమణి రమేశ్ దంపతుల కుమార్తె పొట్ట సంబంధిత వ్యాధితో బాధపడుతుండగా చికిత్స కోసం స్థానికుడైన స్టేట్ బ్యాంక్ రిటైర్డ్ మేనేజర్ పెగళ్లపాటి లక్ష్మీనారాయణ గీత దంపతులు రూ.5 వేల సాయం అందజేశారు. వారు పంపించిన నగదును చిన్నారి తల్లిదండ్రులకు కర్ణకంటి రజిత రామ్మూర్తి దంపతులు సోమవారం అందించారు.

'ఆలయానికి వేరే చోట భూమి కేటాయించండి'

సంగెం : సంత్ సేవాలాల్ ఆలయ నిర్మాణానికి మండలంలోని మొండ్రాయిలో కాకుండా వేరే చోట భూమి కేటాయించాలని ఆ గ్రామానికి చెందిన పలువురు తహసీల్దార్‌ను కోరారు. ఈ మేరకు తహసీల్దార్ రాజ్‌కుమార్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం గ్రామస్తులు మాట్లాడారు. మొండ్రాయిలో గిరిజన కుటుంబం ఒక్కటి కూడా లేదన్నారు. గిరిజనులున్న గ్రామాల్లో భూమి కేటాయిస్తే వారికీ ఉపయోగం ఉంటుందని చెప్పారు. మొండ్రాయిలో 20 గుంటలు కేటాయించడం సరికాదన్నారు. సదరు భూమిని వెనక్కి తీసుకోకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామన్నారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో గ్రామస్తులు పెండ్లి పురుషోత్తం, పోశాల ప్రవీణ్, కుమార్, వేల్పుల భద్రయ్య, కడ్దూరి రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

'ఏజెన్సీ'లో యథేచ్ఛగా మొరం దందా

- టిప్పర్లు, ట్రాక్టర్లలో తరలింపు
- రోడ్లు గుంతలమయమవుతున్న దుస్థితి



మొరం తవ్వుతున్న జేసీబీ

నర్సంపేట రూరల్ : మండలంలోని ఏకైక ఏజెన్సీ పరిధి గ్రామమైన రాజుపేటలో యథేచ్ఛగా మొరం దందా సాగుతోంది. ప్రభుత్వ అనుమతి లేకుండానే అసైన్డ్ భూముల్లో జేసీబీలతో తవ్వకాలు చేపడుతూ పట్టణాలకు టిప్పర్లు, ట్రాక్టర్లలో ఇష్టారీతిన తరలిస్తూ అక్రమార్కులు సొమ్ము చేసుకుంటున్నారు. టిప్పర్లు, ట్రాక్టర్లలో మొరం తరలిస్తుండడంతో గ్రామంలోని మట్టి రోడ్డు గుంతలమయమవుతున్న దుస్థితి నెలకొంది. అయినా ప్రభుత్వం, అధికారులు అడ్డుకట్ట వేయడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

నర్సంపేట శివారులో ఏజెన్సీ పరిధిలోని రాజుపేట ఉంది. పీసా నిబంధనలు, 1/70 యాక్టు అమలులో ఉంటుంది. అయినా నర్సంపేట–మల్లంపల్లి, నర్సంపేట–కొత్తగూడ రహదారుల్లో అధికంగా రెవెన్యూ పరిధిలోని అసైన్డ్ భూములున్నాయి. సర్వే నెంబర్ 116, 117లో గిరిజనులు వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. గ్రామ పరిధిలో 8–9 చిన్నపాటి చెరువులూ ఉన్నాయి. నీళ్లు లేకపోతే చెరువుల్లోని మట్టినే యథేచ్ఛగా వినియోగిస్తున్నారు. ఇటీవల చెరువులన్నీ నీటితో నిండడంతో వాటిని వదిలేసి సదరు సర్వే నంబర్లలోని వ్యవసాయ భూములను రైతుల నుంచి తక్కువ ధరకు కొనుగోలు చేసి మొరం క్వారీలుగా తయారు చేసి మట్టి అమ్మకాలు చేపడుతున్నారు. ఒక్కో ట్రిప్పు ట్రాక్టర్‌కు రూ.1000–1500, టిప్పర్‌కు రూ.5–8 వేలు వరకు దండుకుంటున్న దుస్థితి నెలకొంది. అధికార పార్టీ నాయకులు అనుమతులు లేకుండా అక్రమాలకు పాల్పడుతున్నారంటూ విమర్శలున్నాయి.

చర్యలు తప్పవు



రాజుపేట శివారులో అనుమతులు లేకుండా మొరం దందా సాగుతోందని మాకు సమాచారం లేదు. మొరం దందా జరుగుతున్న ప్రదేశాన్ని పరిశీలించి అక్రమార్కులపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటాం. అనుమతి లేకుండా మొరం క్వారీలు నడిపిస్తే వాహనాలను సీజ్ చేసి కేసులు నమోదు చేస్తాం.

\- రాజేశ్, తహసీల్దార్

గ్రామాన్ని దోచుకుంటున్న గిరిజనేతరులు..!

గ్రామంలోని సర్వే నంబర్ 116, 117ల్లో సుమారు 2 వేల ఎకరాల అసైన్డ్ భూమి ఉంటుంది. ఈ భూములు ఎక్కువ శాతం గిరిజనేతరుల చేతుల్లోనే ఉన్నాయి. దీంతో నామమాత్రపు ధరలకు భూములను కొనుగోలు చేసి మొరం దందా సాగిస్తున్నట్లు పలువురు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. ఇష్టారీతిన క్వాలు తీస్తుండడంతో సదరు గుంతల్లో నీరు చేరి వర్షాకాలంలో పశువులు, రైతులు పడి పోయే ప్రమాదం ఉంది. అయినా ప్రభుత్వం, సంబంధిత శాఖల అధికారులు చర్యలు తీసుకున్న దాఖలాల్లేవు. ఇకనైనా అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

రైతులకు తప్పని తిప్పలు

రాజుపేట శివారులోని వ్యవసాయ భూములకు వెళ్లాలంటే రైతులకు మట్టి రోడ్డే దిక్కు. మొరం అక్రమార్కులు ట్రాక్టర్లు, టిప్పర్లను నడిపిస్తుండడంతో మట్టి రోడ్లు పూర్తిగా గుంతలమయంగా మారుతున్నాయి. రైతులు పొలాలకు వెళ్లాలంటే ఇబ్బందులు పడాల్సి వస్తోంది. రైతులే గుంతలను పూడ్చి వేయించుకుంటున్న దుస్థితి నెలకొంది. రోడ్లు దెబ్బతింటున్నాయని వాహనాలను ఇటీవల గ్రామస్తులు అడ్డుకున్నారు.

క్షయ నివారణ సామాజిక బాధ్యత



నర్సంపేట : ప్రతిజ్ఞ చేయిస్తున్న డాక్టర్ సరోజ



ఖానాపురం : ర్యాలీ తీస్తున్న వైద్యులు, సిబ్బంది

- పీహెచ్‌సీ వైద్యాధికారి సరోజ

నర్సంపేట : క్షయ నివారణను సామాజిక బాధ్యతగా భావించాలని చెన్నారావుపేట పీహెచ్‌సీ వైద్యాధికారి సరోజ ఆకాంక్షించారు. ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని చెన్నారావుపేట పీహెచ్‌సీలో సోమవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. వ్యాధి లక్షణాలను వివరించారు. రెండు వారాలకు మించి దగ్గు, జ్వరం, ఆకలి లేకపోవడం, బరువు తగ్గడం వంటి సమస్యలతో బాధపడుతున్న వ్యక్తులు వెంటనే సమీపంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో తెమడ పరీక్ష చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ కీర్యా, స్టాఫ్ నర్సింగ్ ఆఫీసర్ ఎస్తేరు, హేమలత, సిబ్బంది లీలారాణి, సురేందర్, మంజుల, రాణి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పోషకాహార లోపంతో..

ఖానాపురం : పోషకాహార లోపంతోనే క్షయ వ్యాధి బారిన పడే అవకాశం ఉందని పీహెచ్‌సీ వైద్యురాలు జ్యోతి తెలిపారు. మండల కేంద్రంలో అవగాహనా ర్యాలీ సందర్భంగా ఆమె మాట్లాడారు. వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉన్న కూడా వ్యాధి వస్తుందని చెప్పారు. ఆర్నెళ్లపాటు మందులు వాడితే వ్యాధి నయమవుతుందని తెలిపారు. ప్రభుత్వం వ్యాధిగ్రస్తులకు నెలకు రూ.వెయ్యి పోషణ భత్యం అందిస్తోందని వివరించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ రాజయ్య, సూపర్‌వైజర్ దామోదర్‌రెడ్డి, సిబ్బంది శ్రీనివాసచారి, భాస్కర్, రాంప్రసాద్‌రెడ్డి, భద్రునాయక్, సునీత, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే చొరవతో బస్సు సౌకర్యం



బస్సును ప్రారంభించి మాట్లాడుతున్న హామ్యానాయక్

- బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు హామ్యానాయక్

రాయపర్తి : పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి చొరవతోనే కొలన్‌పల్లికి ఆర్టీసీ బస్సు సౌకర్యం కలిగిందని తొర్రూరు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జాటోతు హామ్యానాయక్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఈదులకంటి రవీందర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని కొలన్‌పల్లి నుంచి ఆర్టీసీ బస్సును సోమవారం పునరుద్ధరించగా వారు కొబ్బరికాయ కొట్టి ప్రారంభించి మాట్లాడారు. కొలన్‌పల్లి మీదుగా హన్మకొండకు బస్సు సౌకర్యాన్ని కల్పించాలని ఎమ్మెల్యేను కోరగా ఆమె స్పందించారని చెప్పారు. మండలంలోని పన్యానాయక్‌తండా, కాట్రపల్లి, బురహన్‌పల్లి, జయరాంతండా(కె), కొలన్‌పల్లి, ఆరెగూడెం, కేశవాపురం మీదుగా హన్మకొండకు బస్సుసౌకర్యం కల్పించి ప్రజల కోర్కెను తీర్చినట్లు తెలిపారు. ప్రజాసమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే కృషి చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో పాలకుర్తి సోమనాథ ఆలయ కమిటీ చైర్మన్ కృష్ణమాచార్యులు, నాయకులు రాజేశ్వర్‌రావు, గిరగాని రాజు, గుజె సుధాకర్, చిలుముల్ల రాజు, చిలుముల్ల రాజశేఖర్, ముక్కెర సంతోశ్, గర్వందుల భాస్కర్, గొని యాకయ్య, గాజుల నరేందర్, పొగాకు యాకన్న, కొసన సోమిరెడ్డి, గోలి వెంకట్‌రెడ్డి, చిరంజీవి, సోమిరెడ్డి, కాసు కుమార్, మద్దెల కొమురయ్య, చెదలు భిక్షపతి, తూళ్ల యాదగిరి, తూళ్ల భిక్షపతి, తూళ్ల రాజు తదితరులు పాల్గొన్నారు.

మత సామరస్యానికి ప్రతీక రంజాన్



ప్రార్థన చేస్తున్న దయాకర్‌రావు, తదితరులు

రాయపర్తి : మత సామరస్యానికి ప్రతీక రంజాన్ అని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. మండల కేంద్రంలోని మజీద్–ఏ–నూర్‌లో ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్, బీఆర్ఎస్ జిల్లా నాయకుడు పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు దయాకర్‌రావు పాల్గొని ప్రత్యేక ప్రార్థన చేశారు. ఈ సందర్భంగా దయాకర్‌రావు మాట్లాడారు. హిందువులు, ముస్లిములు సోదరభావంతో జీవనం సాగించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి, మాజీ జెడ్పీటీసీ రంగు కుమార్ గౌడ్, మండల ప్రధాన కార్యదర్శి పూస మధు, అధికార ప్రతినిధి తాళ్లపెల్లి సంతోశ్ గౌడ్, ఎస్టీ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సురేందర్ రాథోడ్, ముస్లిమ్ మతపెద్దలు హుస్సేన్, ఉస్మాన్, అస్గర్ అలీ, అఫ్సర్ పాషా, అక్బర్, యూసుఫ్ తదితరులు పాల్గొన్నారు.

అంగడి వేలం వాయిదా



నెక్కొండ : మండల కేంద్రంలోని అంగడి (వారాంతపు సంత) వేలం మళ్లీ ఈనెల 26కు వాయిదా పడింది. పంచాయతీ కార్యాలయ ఆవరణలో ఈఓ సదానందం సోమవారం వేలం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మేకల గొర్రెలకు రూ.11.78 లక్షలకు, తైబజారుకు రూ.1.53 లక్షలకు మాత్రమే గుత్తేదారులు పాట పాడడంతో వాయిదా వేసినట్టు ప్రకటించారు. ప్రభుత్వం నిర్ణయించిన (అప్‌సెట్ ప్రైజ్) ధర కంటే తక్కువకు వేలం పాడిన క్రమంలో నిబంధనల మేరకు వాయిదా వేసినట్లు తెలిపారు. మళ్లీ 26న ఉదయం 11 గంటలకు వేలం నిర్వహిస్తామని వివరించారు.

'ఓటు బ్యాంకు రాజకీయం'

వర్ధన్నపేట : స్థానిక ఎమ్మెల్యే నాగరాజు ఓటు బ్యాంకు రాజకీయం చేస్తున్నారని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి కుందూరు మహేందర్‌రెడ్డి సోమవారం ఒక ప్రకనటలో విమర్శించారు. గుడికడితే బిచ్చగాళ్లు తయారవుతారంటూ హిందు మతాన్ని గతంలో అగౌరవపర్చాడని తెలిపారు. ముస్లిములకు ఇఫ్తార్ విందు ఇవ్వడం విడ్డూరంగా ఉందని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ ముస్లిములను మాత్రమే ఓటర్లుగా భావిస్తోందని ధ్వజమెత్తారు. గ్రామాల్లో కులాల వారిగా దేవతలను ప్రజలు పూజిస్తూ పండుగలు చేసుకుంటుండగా ఎమ్మెల్యే ఒక్కసారి కూడా విందు ఇచ్చిన దాఖలాల్లేవని తెలిపారు. స్వలాభం కోసమే ప్రభుత్వ నిధులతో విందు ఇచ్చాడని మండిపడ్డారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో నాగరాజుకు గుణపాఠం చెప్పాలని ప్రజలను కోరారు.

'మత రాజకీయాలు సరికాదు'

పర్వతగిరి : బీజేపీ నాయకులు మత రాజకీయాలకు పాల్పడడం సరికాదని కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు పిన్నింటి అనిల్‌రావు అన్నారు. మండల కేంద్రంలో సోమవారం ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యే నాగరాజు ఇటీవల ఇఫ్తార్ విందు ఏర్పాటు చేస్తే బీజేపీ నాయకులు వక్రీకరించారని తెలిపారు. బడులు కడితే విద్యావంతులౌతారని, గుడులు కడితే బిచ్చగాళ్లు అవుతారని గతంలో ఎమ్మెల్యే నాగరాజు చేసిన వ్యాఖ్యలను సైతం వక్రీకరించారని గుర్తుచేశారు. ఎమ్మెల్యే నాగరాజు అన్ని కులాల, మతాల ప్రజలను ఆదరిస్తున్నారని చెప్పారు. బీజేపీ మత రాజకీయాలు మానుకోవాలని హితవు పలికారు.

ప్రజావ్యతిరేక విధానాలను ఎండగట్టండి

- బీఆర్ఎస్ జిల్లా నాయకుడు శ్రీనివాస్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్‌రెడ్డి

రాయపర్తి : కాంగ్రెస్ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ఎండగట్టాలని కార్యకర్తలను బీఆర్ఎస్ జిల్లా నాయకుడు పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. మండల కేంద్రంలోని బాలరాజు దొడ్డిలో మండల కేంద్రానికి చెందిన పార్టీ ముఖ్యకార్యకర్తలతో సోమవారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ బలోపేతానికి, ప్రజాసమస్యల పరిష్కారానికి కార్యకర్తలు అంకితభావంతో పని చేయాలని చెప్పారు. కార్యకర్తలను, ప్రజలను వ్యక్తిగతంగానే కాకుండా ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ తరఫున సేవలు అందిస్తూ కంటికి రెప్పలా కాపాడుకుంటానని తెలిపారు. నిత్యం ప్రజల్లో ఉంటూ సేవలు అందించాలని కోరారు. అనంతరం తల్లిదండ్రులను కోల్పోయి అనాథగా మారిన మండల కేంద్రంలోని కొత్తరాయపర్తికి చెందిన బొమ్మెర సాయిప్రియకు రూ.10 వేల నగదు సాయంగా అందజేశారు. కొండూరు, తిర్మలాయపల్లి, తెట్టెకుంటతండాను సందర్శించి అంగడి పోషయ్య, బానోతు బెస్య, బద్రి, తిరుపతి ఎల్లమ్మ కుటుంబాలను పరామర్శించి బియ్యం, ఆయిల్ క్యాన్‌లు అందించారు. కార్యక్రమాల్లో మాజీ ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి, మాజీ జెడ్పీటీసీ రంగు కుమార్ గౌడ్, పార్టీ మండల ప్రధానకార్యదర్శి పూస మధు, ఎస్టీ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సురేందర్ రాథోడ్, నాయకులు లేతాకుల రంగారెడ్డి, తాళ్లపెల్లి సంతోశ్ గౌడ్, ఎలమంచ శ్రీనివాస్‌రెడ్డి, లేతాకుల సుధాకర్‌రెడ్డి, సంది దేవేందర్‌రెడ్డి, కర్ర రవీందర్‌రెడ్డి, గారె నర్సయ్య, ఐత రాంచందర్, తదితరులు పాల్గొన్నారు.

జమిలి ఎన్నికలపై అవగాహన కల్పించాలి

సంగెం : జమిలి ఎన్నికలపై ప్రజలకు అవగాహన కల్పించాలని బీజేపీ మండల అధ్యక్షుడు దామెరుప్పుల చంద్రమౌళి శ్రేణులకు సూచించారు. స్థానిక గంగపుత్ర కమ్యూనిటీ హాల్‌లో సోమవారం నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి దేశాన్ని ప్రపంచంలో ముందుంచే దిశగా అభివృద్ధి చేస్తున్నట్టు తెలిపారు. ఈ క్రమంలో ప్రధాని మోదీ అనేక సాహసోపేత నిర్ణయాలు తీసుకుంటున్నారని చెప్పారు. జమిలి ఎన్నికల వల్ల సమయం, డబ్బు ఆదా అవుతాయని తెలిపారు. 'ఒకే దేశం.. ఒకే ఎన్నిక'పై ప్రజలను చైతన్యవంతం చేయాలని సూచించారు. సమావేశంలో నాయకులు బుట్టి కుమారస్వామి, యాదగిరిరావు, శేషాద్రి, సారమ్మ, చేరాలు, పైడి, రాంబాబు, బాబు, శ్యామ్, గోపాల్, సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

నియామకం



గీసుకొండ : మండలంలోని ఎలుకుర్తి హవేలికి చెందిన ఐలోని అభిషేక్ జాతీయ మానవ హక్కుల కమిటీ(ఎన్‌హెచ్ఆర్‌సీ) జిల్లా సోషల్ మీడియా కన్వీనర్‌గా నియమితులయ్యారు. ఈ మేరకు కమిటీ స్టేట్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి ఉత్తర్వుల నేపథ్యంలో జిల్లా అధ్యక్షుడు గంగుల అశోక్ సోమవారం నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా అభిషేక్ మీడియాతో మాట్లాడారు. సోషల్ మీడియా ద్వారా మానవ హక్కుల పరిరక్షణకు కృషి చేస్తానని చెప్పారు.

యువతకు సత్వరమే సర్టిఫికెట్లు ఇవ్వండి



వినతిపత్రం ఇస్తున్న నరేశ్, తదితరులు

నల్లబెల్లి : రాజీవ్ యువవికాసం పథకానికి దరఖాస్తు చేసుకునే యువతకు కుల, ఆదాయ, ఇతర ధ్రువీకరణ పత్రాలు సత్వరమే ఇవ్వాలని ఏబీఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బొట్ల నరేశ్, దళిత విద్యావంతుల వేదిక జిల్లా కార్యదర్శి బట్టు సాంబయ్య ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు వారు తహసీల్దార్ కృష్ణను కార్యాలయంలో సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం నరేశ్, సాంబయ్య మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ యువతకు ఉపాధి కల్పించే దిశగా రాజీవ్ యువ వికాసం పథకాన్ని అమలు చేయనుందని చెప్పారు. సర్టిఫికెట్ల అందజేతలో జాప్యం జరిగితే యువత నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. కుల, ఆదాయ, ఇతర ధ్రువీకరణ పత్రాల దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిశీలించి అర్హులకు అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు సాంబరాజు, శ్రీకాంత్, రజనీకాంత్, ప్రశాంత్, వెంకటేశ్, రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

గౌరవ వేతనం అందించాలి

ఖానాపురం : బీఎల్ఓలకు గౌరవ వేతనం అందించాలని బీఎల్ఓల సంఘం మండల అధ్యక్షుడు కత్తి కుమారస్వామి కోరారు. ఈ మేరకు ఆయన ఆధ్వర్యంలోని బృందం ఆర్డీఓ కార్యాలయంలో అధికారికి సోమవారం వినతిపత్రం అందజేసింది. అనంతరం కుమారస్వామి మాట్లాడారు. 14 నెలలుగా వేతనాలు అందకపోవడంతో కుటుంబ పోషణలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో సంఘం బాధ్యులు కాసు యాకయ్య, ఐలుమల్లు, భిక్షపతి, శ్రీను, రాజు, శంకర్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

ఆంక్షలు లేకుండా రుణమాఫీ చేయాలి

- ఏఐకేఎఫ్ కన్వీనర్ రాంచందర్



సమావేశంలో మాట్లాడుతున్న రాంచందర్

సంగెం : ఆంక్షలు లేకుండా అర్హులైన రైతులందరికీ రూ.2 లక్షల చొప్పున వెంటనే రుణమాఫీ చేయాలని అఖిల భారత కిసాన్ ఫెడరేషన్ (ఏఐకేఎఫ్) కన్వీనర్ గోనె రాంచందర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని కుంటపల్లిలో సోమవారం నిర్వహించిన ఫెడరేషన్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో విఫలమైందన్నారు. వెంటనే రుణమాఫీ చేయాలని, దేవాదుల ఎత్తిపోతల నీరు అందక పంటలు ఎండిపోయి నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.30 వేలు చొప్పున పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు రౌతు శ్రీను, ఎనబోతుల సాంబయ్య, రౌతు శ్రీనివాస్, స్వామి, ఐలయ్య, సోమిరెడ్డి రవి, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మహత్యకు యత్నించిన యువకుడి మృతి



రజనీకుమార్ (ఫైల్)

దుగ్గొండి : మద్యానికి బానిసగా మారి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించిన యువకుడు పరిస్థితి విషమించి మృతి చెందిన ఘటన మండల కేంద్రంలో సోమవారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా.. మండల కేంద్రానికి చెందిన చంద్రగిరి రజనీకుమార్ (42) కొంతకాలం ఆర్మీలో జవాన్‌గా పని చేశాడు. ఆయన మద్యానికి బానిస కావడంతో చాలా ఏళ్ల క్రితమే ఉద్యోగం పోయింది. రజనీకుమార్‌కు తల్లిదండ్రులు రెండు సార్లు వివాహం జరిపించారు. మద్యానికి బానిసగా మారి ఇంట్లోని వస్తువులు సైతం అమ్ముకుంటుండడంతో రెండుసార్లు భార్యలు విడాకులు ఇచ్చారు. రజనీకుమార్ ఈనెల 19న ఇంట్లో ఎవరూ లేని సమయంలో రాత్రి 8 గంటల ప్రాంతంలో గడ్డి మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. అతడిని తల్లిదండ్రులు వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రిలో చేర్పగా చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి సోమవారం ఉదయం మృతి చెందాడు. మృతుడి తండ్రి సంజీవ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నీలోజు వెంకటేశ్వర్లు తెలిపారు.

చింతచెట్టుపై నుంచి పడి కూలీ..



నిమ్మ (ఫైల్)

వర్ధన్నపేట : ప్రమాదవశాత్తు చింతచెట్టుపై నుంచి పడి కూలీ మృతి చెందిన ఘటన మండలంలోని ఇల్లందలో చోటు చేసుకుంది. ఎస్సై కథనం ప్రకారం.. ఎస్ఎస్‌తండాకు చెందిన నేతావత్ నిమ్మ (35) గ్రామానికి చెందిన విజయ, కల్పన, స్వర్ణ, బుజ్జిలతో కలిసి ఇల్లందకు చెందిన ఒకరి ఇంటి ఎదుట ఉన్న చింత చెట్టు కాయ తెంపడానికి కూలి మాట్లాడుకున్నారు. ఈ క్రమంలో సోమవారం చెట్టు ఎక్కి చింతకాయ తెంపుతుండగా ప్రమాదవశాత్తు కాలుజారి కింద పడిపోయాడు. నిమ్మ తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య శారద ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చందర్ తెలిపారు.

పరామర్శ

దుగ్గొండి : మండలంలోని కేశవాపురం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు బొంతల సాయికుమార్ ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబాన్ని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు ఏనుగుల రాకేశ్‌రెడ్డి సోమవారం పరామర్శించారు. తొలుత సాయికుమార్ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో శానబోయిన రాజ్‌కుమార్, బాలకృష్ణ, సాగర్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

29న సొసైటీ మహాసభ

నర్సంపేట : ఈనెల 29న చెన్నారావుపేట మండలంలోని అమీనాబాద్ సొసైటీ 70వ వార్షిక మహాసభ నిర్వహిస్తామని సీఈఓ పులి రమేశ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సొసైటీ కార్యాలయ ఆవరణలో ఉదయం 11 గంటలకు చైర్మన్ మురహరి రవి అధ్యక్షతన మహాసభ ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. సభ్యులు సకాలంలో హాజరై విజయవంతం చేయలని కోరారు.

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



దుగ్గొండి : మండలంలోని గిర్నిబావిలోని శ్రీ చైతన్య విద్యాలయంలో సోమవారం పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా 1998–99 విద్యాసంవత్సరంలో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు కలుసుకుని నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుని ఆనంద డోలికల్లో తేలియాడారు. స్నేహాన్ని కొనసాగించాలని, ఒకరికొకరు అండగా నిలవాలని నిర్ణయించుకున్నారు. తమకు విద్యాబోధన అందించిన గురువులు రాజేందర్‌రెడ్డి, రవీందర్, కొమురయ్య, శ్రీనివాస్, నాగేశ్వర్‌రావు, సలీమ్, జీవన్‌రెడ్డిలను సాదరంగా ఆహ్వానించారు. శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పూర్వవిద్యార్థులు బండి కిరణ్, రంగు రాజు, తదితరులు పాల్గొన్నారు.

తప్పిపోయిన వృద్ధుడి మృతదేహం లభ్యం

ఎస్ఎస్ తాడ్వాయి : ఫిబ్రవరిలో జరిగిన మినీ మేడారం జాతరలో తప్పిపోయిన వృద్ధుడి మృతదేహం అడవిలో సోమవారం లభ్యమైందని తాడ్వాయి ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. వరంగల్ జిల్లా ఖానాపురం మండలానికి చెందిన జబ్బ సారంగం (60) జాతరకు వచ్చిన తప్పిపోయాడు. ఆచూకీ లభించకపోవడంతో పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. మతి స్థిమితం లేక సారంగం అడవిలో తిరుగుతూ నీరు, ఆహారం లేక మృతి చెంది ఉండొచ్చని ఎస్సై చెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.